క్లుప్తంగా

విద్యార్థుల ఫీజు చెల్లింపు



ఫీజులు చెల్లిస్తున్న సంఘ ఉద్యోగులు

మలికిపురం: మండల బీసీ ఉద్యోగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విశ్వేశ్వరయపురం హైస్కూల్‌లో నిర్వహిస్తున్న ఉచిత పాలిటెక్నిక్, ఏపీఆర్జేసీ శిక్షణలో ఉన్న 50 మంది విద్యార్థుల ఆన్‌లైన్ ఫీజును సూర్యచంద్ర చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు వాసు సాయిరాం అందజేశారు. ఈ మొత్తాన్ని బీసీ ఉద్యోగ సంక్షేమ సంఘ సభ్యులు విద్యార్థులకు అందజేశారు. వాసు సాయిరాంకి సంఘం తరపున ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ ఉద్యోగ సంఘ అధ్యక్షుడు కంకటాల చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి చింతా జయప్రకాష్, చింతామణి, కృష్ణ కిషోర్, మల్లేశ్వరరావు, నాగరాజు, మోహన్, మధు సారథి, విజయ కుమార్, పుష్పలత పాల్గొన్నారు.

నేడు మంజేరులో ఇంటింటా పర్యటన

కాజులూరు: మండలంలోని మంజేరులో శనివారం రామచంద్రపురం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్ ఇంటింటి పర్యటన చేపట్టనున్నట్టు సర్పంచ్ గుంటూరి అప్పారావు తెలిపారు. శుక్రవారం గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం వరకూ సూర్యప్రకాశ్ ఇంటింటా పర్యటించి జగనన్న పాలనలో ప్రతి కుటుంబానికి కలిగిన లబ్ధిని వివరిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారన్నారు. మండల గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సహకార సంఘాల అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు విధిగా హాజరు కావాలన్నారు.

బూత్ ఏజెంట్లకు 'సిద్ధం' కిట్ల పంపిణీ



అంతర్వేదిపాలెంలో బూత్ ఏజెంట్లకు సిద్ధం కిట్లు ఇస్తున్న నాయకులు

సఖినేటిపల్లి: మండలంలోని అంతర్వేదిపాలెంలో శుక్రవారం జరిగిన వైఎస్సార్ సీపీ సమావేశంలో బూత్ ఏజెంట్లకు సిద్ధం కిట్లను నాయకులు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, సర్పంచ్ నల్లి లీలావతి. ఎంపీటీసీ మందపాటి రత్నం, నాయకులు సరెళ్ల విజయ్ ప్రసాద్, ఈద రవిరెడ్డి, తోటి జాన్ బాబు, నల్లి త్రిమూర్తులు, మందపాటి సత్యనారాయణ, తాడి సహదేవ్ పాల్గొన్నారు.

మూడు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం

మామిడికుదురు: పి.గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గం జనసేనకు చెందిన ఉమ్మడి అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ శుక్రవారం మొగలికుదురు, నగరం, పెదపట్నం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చైతన్య రథంపై తిరుగుతూ టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఆయా పార్టీలకు చెందిన జాలెం శ్రీనివాసరాజు, మొల్లేటి శ్రీనివాస్, అడబాల తాతకాపు, మద్దాల కృష్ణమూర్తి, బోనం బాబు, జాలెం సుబ్బారావు, మద్దా చంటి, దొంగ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలి

అంబాజీపేట: ప్రస్తుత వాతావరణం.. అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో రోగాల బారిన పడే అవకాశం ఉందని ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని ముక్కామల వైద్యాధికారి ఎ.ఇంద్రావతి అన్నారు. పుల్లేటికుర్రు శివారు వ్యాఘ్రేశ్వరంలో ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఇంద్రావతి మాట్లాడుతూ వేసవిలో వడగాల్పులకు గురికాకుండా తగిన చర్యలు తీసుకుని జాగ్రత్తగా ఉండాలన్నారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

ప్రజాస్వామ్యంలో ఓటే బలమైన ఆయుధం



మోరిపోడులో ప్రజలకు ఓటు విలువపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో

సఖినేటిపల్లి: ప్రజాస్వామ్యంలో ఓటే బలమైన ఆయుధమని ఎంపీడీవో పీవీ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం మోరిపోడు, సఖినేటిపల్లి శాంతి నగర్‌లో ఓటు హక్కు వినియోగంపై ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహించారు. ఓటు విలువ తెలుసుకో, భవిష్యత్తును కాపాడుకో అంటూ పై ర్యాలీల్లో నినదించారు. ఎన్ఆర్‌జీఎస్ ఏపీవో ప్రసాద్, ఫీల్డ్ అసిస్టెంట్ కె.అగస్టీన్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జగన్ మాట నెరవేర్చారు..
జగ్గిరెడ్డి అండగా నిలిచారు

- అందుకే మనస్ఫూర్తిగా మద్దతు ఇస్తున్నాం
- వానపల్లిలో టీడీపీ, జనసేన పార్టీలకు కార్యకర్తల రాజీనామా..
- ఎమ్మెల్యే జగ్గిరెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిక



వానపల్లిలో పార్టీలో చేరిన నాయకులకు పార్టీ కండువాలు వేస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

కొత్తపేట: గత ఎన్నికల్లో ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటపై నిలిచి, ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారు. ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ, ఎప్పుడూ అందుబాటులో అండగా నిలిచారు. అందుకే వారికి మనస్ఫూర్తిగా మద్దతు పలుకుతున్నామని మండలంలోని వానపల్లి గ్రామానికి చెందిన టీడీపీ, జనసేన పార్టీల్లో పనిచేసిన నాయకులు, కార్యకర్తలు ముక్తకంఠంతో మాటిచ్చారు. గొల్లపల్లి ఆనంద్‌బాబు, నక్కా యాకోబు, బెజవాడ సురేష్, పేరూరి భాస్కరరావు, బండారు పళ్లంరాజు, సాపిరెడ్డి నాగరాజు, కంఠంశెట్టి పుల్లయ్యనాయుడు, పళ్లంరాజు, బండారు నాగేశ్వరరావు, సత్తిరాజు, వనుముశెట్టి సూర్యనారాయణమూర్తి, బాలం ప్రసాద్‌సహా 40 మంది కార్యకర్తలు ముకుమ్మడిగా ఆయా పార్టీలకు రాజీనామా చేసి ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి సమక్షంలో చేరారు. వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత టీడీపీ పాలనకు, వైఎస్సార్ సీపీ పాలనకు ఎంతో వ్యత్యాసం ఉందని, ఆ ప్రభుత్వం పక్షపాతంగా పరిపాలన సాగిస్తే, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎటువంటి పక్షపాతం లేకుండా ప్రజా సంక్షేమ పథకాలు అమలు చేసిందన్నారు. ఇంతకాలం టీడీపీ, జనసేనలో పనిచేశాం.. అయినా జగన్ ప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజలకే కాక ప్రతిపక్ష పార్టీల కార్యకర్తలమని చూడకుండా మా అర్హతను గుర్తించి వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక ప్రయోజనాలు కల్పించారన్నారు. దాంతో ఏ విధమైన ఇబ్బందులు లేకుండా జీవనం సాగిస్తున్నామన్నారు. అలాగే ఎమ్మెల్యే జగ్గిరెడ్డిని కష్టకాలంలో ఆశ్రయించి వెళితే వెంటనే స్పందించి సాయం చేసే గొప్ప వ్యక్తిత్వం గల నాయకుడని అన్నారు. ఏ విధమైన ప్రయోజనం లేని టీడీపీ, జనసేనలో కొనసాగే కంటే ప్రజా ప్రయోజనాలు కాపాడే వైఎస్సార్ సీపీకి, నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులో ఉండే జగ్గిరెడ్డికి మద్దతుగా నిలవాలని తీర్మానించుకున్నామని అన్నారు. రాబోయే ఎన్నికల్లో మిమ్మల్ని గెలిపిస్తాం అని జగ్గిరెడ్డికి మాటిచ్చారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మాట్లాడుతూ ఏనాడూ కనీ వినీ ఎరుగని రీతిలో పార్టీ రహితంగా, అర్హతే ప్రామాణికంగా పేద, మధ్యతరగతి ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై, తనపై విశ్వాసంతో మద్దతుగా పార్టీలో చేరడం తనకు కొండంత అండ అని అన్నారు.

వానపల్లిలో పార్టీ కార్యాలయం ప్రారంభం

వానపల్లి గ్రామంలో వైఎస్సార్ సీపీ ఎన్నికల కార్యాలయాన్ని ఎమ్మెల్యే, పార్టీ అభ్యర్థి జగ్గిరెడ్డి సమక్షంలో ఆ గ్రామ పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్, డీసీసీబీ పర్సన్ బండారు సత్తిరాజు (రాజా) ప్రారంభించారు. అనంతరం మండల పార్టీ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు అధ్యక్షతన గ్రామ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ మార్గన గంగాధరరావు, పళ్లాలమ్మ దేవస్థానం చైర్మన్ కామిశెట్టి అమ్మన్న, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతిరావు, అవిడి సర్పంచ్ రెడ్డి చంటి, గ్రామ పార్టీ పరిశీలకుడు మునునూరి వెంకటేశ్వరరావు, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు సాకా జానకిరామరాజు, గ్రామ పార్టీ అధ్యక్షుడు గొల్లపల్లి శ్రీనివాసరావు, పార్టీ యువజన విభాగం సభ్యుడు ఇసుకపట్ల సునీల్, పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమంలో జగనన్న ముందంజ



పుల్లేటికుర్రులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి వేణుగోపాలరావు తదితరులు

పి.గన్నవరం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వేణుగోపాలరావు

అంబాజీపేట: రాష్ట్రంలోని ప్రజలకు మంచి పాలన, ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమం అందించడంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ముందంజలో ఉన్నారని పి.గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. కె.పెదపూడి, పుల్లేటికుర్రు గ్రామాల్లో వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారాన్ని శుక్రవారం నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థి వేణుగోపాలరావుకు గ్రామస్తులు అడుగడుగునా హారతులిస్తూ ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే అభ్యర్థి వేణుగోపాలరావు మాట్లాడుతూ పేద ప్రజల అభ్యున్నతి, రాష్ట్ర భవిష్యత్ సీఎం జగన్ మోహన్‌రెడ్డితోనే సాధ్యమన్నారు. గతంలో సంక్షేమ లబ్ధి పేదలకు చేరడానికి జన్మభూమి కమిటీలు అడ్డంకిగా ఉండేవన్నారు. వాటి అరాచకాలను ఆపడానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థను చేపట్టి ప్రజలకు అండగా నిలిస్తే చంద్రబాబు అండ్‌కో వారిపై అక్కసు వెళ్లగక్కుతున్నారని విమర్శించారు. సంక్షేమ సారథుడికి ప్రతి ఒక్కరూ అండగా ఉండి విజయానికి కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు, ఎంపీ అభ్యర్థిగా రాపాకకు రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేసి గెలిపించాలని వేణుగోపాలరావు కోరారు. మాజీ ఎమ్మెల్యే పి.రాజేశ్వరీదేవి, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పీకే రావు, రాష్ట్ర నాయకులు ముత్తాబత్తుల మణిరత్నం, ఉభయ గోదావరి జిల్లాల కన్వీనర్ పేరి శ్రీనివాస్, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, పార్టీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, జిల్లా నాయకులు చిట్టూరి రాధాబాయ్, కొర్లపాటి కోటబాబు, ఎంపీటీసీలు వడలి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో దివ్యాంగులకు ప్రత్యేక సౌకర్యాలు



ఓటు హక్కు ప్రాముఖ్యతపై పి.గన్నవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పి.గన్నవరం: ఎన్నికల్లో పాల్గొనే దివ్యాంగులకు ప్రత్యేక సదుపాయాలు కల్పించడంతో పాటు, వారికి ఉపయోగపడేలా సాక్షం యాప్‌ను ఎన్నికల సంఘం అందుబాటులోకి తీసుకువచ్చిందని జిల్లా దివ్యాంగుల ఎన్నికల నోడల్ అధికారి బీవీ రమణ తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద పి.గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి దివ్యాంగులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు క్రమబద్ధమైన ఓటరు విద్య, ఎన్నికల్లో భాగస్వామ్యంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం కల్పించిన సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని, జిల్లాలో నూరు శాతం దివ్యాంగులు ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. విభిన్న ప్రతిభావంతుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థల అభిప్రాయాలను తెలుసుకున్నారు. దివ్యాంగుల కోసం అన్ని పోలింగ్ కేంద్రాలను గ్రౌండ్ ఫ్లోర్లలోనే ఏర్పాటు చేసినట్టు వివరించారు. వీరి కోసం ఎన్నికల కమిషన్ ప్రత్యేకంగా రూపొందించిన సాక్షం యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. 85 సంవత్సరాలు దాటిన, నడవలేని స్థితిలో మంచానికే పరిమితమైన వారు, నడవలేని దివ్యాంగులు హోమ్ ఓటింగ్ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనపై సి-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. దివ్యాంగులకు సహాయకులుగా పోలింగ్ కేంద్రాల వద్ద ఎన్‌సీసీ క్యాడెట్లను నియమిస్తామని తెలిపారు. అంధులకు కూడా ప్రత్యేక సౌకర్యాలు కల్పించినట్టు రమణ వివరించారు. అనంతరం ఓటు హక్కు ప్రాముఖ్యతపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌ఓ ఎం.దుర్గారావు దొర, తహసీల్దార్లు షేక్ హుస్సేన్, విమల లక్ష్మి, మేరీకమ్మ, ఎంపీడీఓలు సీహెచ్.త్రిశూలఫాణి, వేణుగోపాల్ రెడ్డి, వైద్యాధికారులు భార్గవి, రియా పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో బాలికల హవా



ప్రథమ స్థానంలో నిలిచిన మామిడికుదురు జూనియర్ కళాశాల విద్యార్థినులు



ఎస్.షాలినీదేవి

కొత్తపేట: ఇంటర్మీడియెట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్ష ఫలితాల్లో బాలికలే అత్యుత్తమ ఫలితాలతో ప్రతిభను చాటారు. కొత్తపేటలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులు 178 మందికి 92 మంది (52 శాతం), ద్వితీయ సంవత్సరం 154 మందికి 99 మంది (64.28 శాతం) ఉత్తీర్ణులయ్యారని ప్రిన్సిపాల్ వై.లక్ష్మణరావు తెలిపారు. ద్వితీయ సంవత్సరం బైపీసీ విద్యార్థిని ఎస్.షాలినీదేవి 1000కి 913 మార్కులు, హెచ్ఈసీ విద్యార్థిని చాట్ల సాయిరేణుక 864 మార్కులు, ఒకేషనల్ (ఎంఎల్‌టీ) విద్యార్థిని ఎస్‌కే కరీమున్నీసా 934 మార్కులు సాధించారని తెలిపారు.

ఇంటర్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులు

మామిడికుదురు: ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో మామిడికుదురు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారని కళాశాల ప్రిన్సిపాల్ కేఎస్‌వీఎస్ఎస్ యేసుబాబు శుక్రవారం తెలిపారు. మొదటి సంవత్సరం పరీక్షలకు 66 మంది విద్యార్థులు హాజరు కాగా 33 మంది ఉత్తీర్ణులయ్యారని చెప్పారు. 50 శాతం ఉత్తీర్ణత నమోదైందన్నారు. రెండో సంవత్సరం పరీక్షలకు 48 మంది హాజరు కాగా 28 మంది పాసయ్యారని తెలిపారు. 58 శాతం ఉత్తీర్ణత నమోదైందన్నారు. ఫస్ట్ ఇయర్‌లో ముస్తాక్ జెహ్రా 426 మార్కులు, తహసిన్ ఎ.ఫాతిమా 407 మార్కులు, యేడిద విజయనాగదుర్గ 379 మార్కులు సాధించారన్నారు. రెండో సంవత్సరంలో టి.రూపాస్వాతి 908, తిరుమాని శ్రీను 839, ఆకుమర్తి మల్లిక 837 మార్కులు సాధించి మొదటి మూడు స్థానాల్లో నిలిచారన్నారు.

ఎనిమిది మంది విద్యార్థుల ఉత్తీర్ణత

అంబాజీపేట: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో 8 మంది విద్యార్థులు ఉత్తీర్ణత అయినట్లు హెచ్ఎం కడలి సాయిరామ్ శుక్రవారం తెలిపారు. ఎంపీసీలో 9 మంది పరీక్షకు హాజరు కాగా ముగ్గురు, బైపీసీలో 14 మందికి ఐదుగురు పాసయ్యారన్నారు. మొదటి సంవత్సరం బైపీసీలో కె.కీర్తనకు 344, ఎంపీసీలో బి.నవ్య శ్రీకి 349 మార్కులు వచ్చాయన్నారు. తెలుగులో 100కి 99 మార్కులు అత్యధికంగా వచ్చాయన్నారు.

ప్రజలు పట్టం కట్టేది వైఎస్సార్ సీపీకే..



అంతర్వేదిపాలెం సమావేశంలో పాల్గొన్న అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు

సఖినేటిపల్లి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలంతా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని వైఎస్సార్ సీపీకే పట్టం కట్టనున్నారని ఆ పార్టీ రాజోలు అసెంబ్లీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. శుక్రవారం అంతర్వేదిపాలెంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తల, నాయకుల సమావేశం జరిగింది. ఎన్నికల్లో అమలాపురం ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావుకు, రాజోలు అసెంబ్లీ అభ్యర్థిగా తనకు ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. పార్టీకి ఎక్కువ శాతం మహిళా ఓటర్లే కొండంత అండగా ఉన్నారన్నారు. జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, ఎంపీపీ వీరా మల్లిబాబు, సర్పంచ్ నల్లి లీలావతి, ఎంపీటీసీ మందపాటి రత్నం, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ నల్లి మోహన్, నాయకులు నల్లి సురేంద్ర, ఈద రవిరెడ్డి, సరెళ్ల విజయ్ ప్రసాద్, కడలి సువర్ణరావు, తోటి జాన్‌బాబు పాల్గొన్నారు.

ప్రజాదరణతో హ్యాట్రిక్ సాధిస్తున్నాం

- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి జగ్గిరెడ్డి
- అయినవిల్లిలో ఎన్నికల ప్రచార రథానికి ప్రత్యేక పూజలు



అయినవిల్లిలో ఎన్నికల ప్రచార రథాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

కొత్తపేట: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలపై, తన పట్ల అచంచల ప్రజాదరణతో హ్యాట్రిక్‌తో నాలుగోసారి విజయం సాధిస్తున్నామని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. జరగనున్న అసెంబ్లీ, పార్లమెంట్ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రూపొందించిన జగ్గిరెడ్డి ప్రచార రథానికి అయినవిల్లి సిద్ధి వినాయక స్వామి వారి ఆలయం వద్ద శుక్రవారం ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ప్రత్యేక పూజలు చేయించి, ప్రారంభించారు. ఆయన ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పార్టీ నాయకులతో కలసి ప్రచార రథం ఎక్కారు. ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో ఏ విధమైన సిఫారసులతో పనిలేకుండా కేవలం అర్హతను మాత్రమే పరిగణనలోకి తీసుకుని, ఆర్థిక ప్రయోజనాలు కల్పించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేనన్నారు. దీంతో ఈ ఎన్నికల్లో ప్రజలను ఓటు అడిగే హక్కు, అర్హత వైఎస్సార్ సీపీ అభ్యర్థులకే ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మార్గన గంగాధరరావు, మండల పార్టీ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు, కొత్తపేట పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ మునునూరి వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు నెల్లి లక్ష్మీపతిరావు, రెడ్డి చంటి, రైతు విభాగం సభ్యుడు బండారు దొరబాబు, వానపల్లి గ్రామ పార్టీ అధ్యక్షుడు గొల్లపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రయత్నాలు విఫలమే



పడమటిపాలెంలో పార్టీలో చేరిన కార్యకర్తలతో వైఎస్సార్ సీపీ రాజోలు అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు

వైఎస్సార్ సీపీ రాజోలు అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు

మలికిపురం: వైఎస్సార్ సీపీని దెబ్బ కొట్టాలని తెలుగుదేశం, జనసేన, బీజేపీల కూటమి చేస్తున్న ప్రయత్నాలు విఫలమే అని రాజోలు వైఎస్సార్ సీపీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. శుక్రవారం మండలంలోని పడమటిపాలెంలో రాజోలు అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు సమక్షంలో గ్రామానికి చెందిన పార్టీ నాయకులు అడబాల సుధాకర్, మంతా బాబూరావుల ఆధ్వర్యంలో టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీకి భారీ చేరికలు జరిగాయి. సుమారు 50 మంది టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. జగన్ పాలన విధానం నచ్చి పార్టీలోకి చేరినట్లు వారు పేర్కొన్నారు. వారందరికీ పార్టీ కండువా కప్పి సూర్యారావు ఆహ్వానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గొల్లపల్లి విజయం కోరుతూ ముస్లింల ప్రార్థనలు



రాజోలు మసీదు వద్ద ముస్లింలతో కలసి ప్రార్థనల్లో పాల్గొన్న గొల్లపల్లి

రాజోలు: స్థానిక జామియా మసీదు వద్ద ముస్లింలు రాజోలు అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు విజయం కోరుతూ శుక్రవారం ప్రార్థనలు చేశారు. వైఎస్సార్ సీపీకి మద్దతు కోరుతూ ముస్లిం పెద్దలను గొల్లపల్లి కలుసుకున్నారు. ఈ సందర్భంగా గొల్లపల్లి మాట్లాడుతూ ముస్లిం మైనార్టీలకు అండగా నిలిచిన ఏకైక పార్టీ వైఎస్సార్ సీపీ అన్నారు. రాబోయే ఎన్నికల్లో మతతత్వ పార్టీలకు బుద్ధి చెప్పాలని కోరారు. సర్పంచ్ రేవు జ్యోతి, ఎంపీటీసీలు చెల్లింగి లక్ష్మీఈశ్వరి, కొపనాతి పుష్పలత, దార్ల పెదబాబు, అడబాల జానకీరామ్, మట్టా ఏడుకొండలు, బండారు కాశీ, బొడ్డపల్లి ప్రసాద్, బుంగ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పళ్లాలమ్మకు ఎమ్మెల్యే పూజలు



పళ్లాలమ్మ ఆలయంలో కుంకుమ పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి-లావణ్య దంపతులు, కుటుంబ సభ్యులు

కొత్తపేట: మండలంలోని వానపల్లి గ్రామ దేవత పళ్లాలమ్మ అమ్మవారి ఆలయంలో ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి-లావణ్య దంపతులు, ఆయన నలుగురు సోదరీమణులు శుక్రవారం ఉదయం ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. అమ్మవారికి మొక్కుబడి మేరకు జగ్గిరెడ్డి దంపతులు, కుటుంబ సభ్యులతో ఆలయ అర్చకులు కుంకుమ పూజలు చేయించారు. ముందుగా ఆలయ ముఖద్వారంలో దేవస్థానం పాలకమండలి చైర్మన్ కామిశెట్టి అమ్మన్న, సభ్యులు, డీసీసీబీ పర్సన్ బండారు రాజా, ఏఎంసీ డైరెక్టర్ సాకా జానకిరామరాజు, గ్రామ పార్టీ అధ్యక్షుడు గొల్లపల్లి శ్రీనివాసరావు తదితర నాయకులు, గ్రామ పెద్దలు జగ్గిరెడ్డి కుటుంబానికి ఘనస్వాగతం పలికి ఆలయానికి తోడ్కొని వెళ్లారు.

సంపూర్ణ పారిశుధ్య చర్యలు పాటించాలి



ఆలమూరులో సంపూర్ణ పారిశుధ్య చర్యలను పరిశీలిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

ఆలమూరు: గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పేందుకు వీలుగా ప్రతి శుక్రవారాన్ని పొడివారం (ఫ్రైడే)గా పాటించి సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.మల్లికార్జున, పి.భవానీశంకర్ కోరారు. ఫ్రైడే సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆరోగ్య, ఆశ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఇంట్లో నిల్వ నీరు ఉండకుండా తీసుకోవలసిన చర్యలను వివరించారు. రుబ్బురోళ్లు, కొబ్బరి చిప్పలు, ఖాళీ సీసాలు, వ్యర్థాలను ఇంట్లో ఉండకుండా చూడాలని మహిళలకు సూచించారు. దీనివల్ల క్రిమి, కీటకాలు దరి చేరవని, తద్వారా అంటు వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉండదన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించి మెరుగైన ఆరోగ్యకర సమాజాన్ని నెలకొల్పాలని ప్రజలను కోరారు. వివిధ గ్రామాల్లో ఆరోగ్య, ఆశ సిబ్బంది ఫ్రైడేను వివరిస్తూ భారీ ర్యాలీలు నిర్వహించారు. సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ, ఎంపీహెచ్‌ఈఓ కె.జ్యోతి కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలమణి తదితరులు వైద్యసేవలను పర్యవేక్షించారు.

ఎన్నికల నేపథ్యంలో వివాదాలకు తావు లేదు



వీరవల్లిపాలెంలో సీఆర్‌పీఎఫ్ దళాలతో మార్చ్ ఫాస్ట్ నిర్వహిస్తున్న ఎస్సై బి.రాజేష్‌కుమార్

అయినవిల్లి: ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఏ విధమైన వివాదాలకు తావు లేదని దీనికి వ్యతిరేకంగా వివాదాలు సృష్టించినా, వివాదాల్లోకి దిగిన వారిపై కఠిన చర్యలు తప్పవని స్థానిక ఎస్సై బి.రాజేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం వీరవల్లిపాలెం గ్రామంలో గ్రామస్తులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఎస్సై రాజేష్‌కుమార్ సీఆర్‌పీఎఫ్ దళాలతో మార్చ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యువత ఎన్నికల ప్రచారంలో ఏ విధమైన గొడవలో తలదూర్చవద్దన్నారు. అలా గొడవల్లో పాల్గొంటే వారిపై పోలీసు కేసులు ఉంటాయన్నారు. అలాంటిరు భవిష్యత్‌లో ఏ విధమైన ప్రభుత్వ ఉద్యోగానికి అర్హులు కారన్నారు. అలాగే గ్రామ పెద్దలు తరచూ గొడవలు దిగే వారి పేర్లు ముందుగా చెప్పాలన్నారు. గొడవలకు దిగే వారిని అదుపులోకి తీసుకుని తగిన కౌన్సెలింగ్ ఇస్తామన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతవరణంలో జరిగే విధంగా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక పోలీ స్టేషన్ సిబ్బంది హాజరయ్యారు.

నూకాలమ్మ సన్నిధిలో మాజీ ఎమ్మెల్యే



మామిడికుదురు నూకాలమ్మను దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే రాజేశ్వరీదేవి

మామిడికుదురు: గ్రామ దేవత శ్రీనూకాలమ్మ జాతర మహోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి ముడుపులు, మొక్కుబడులు సమర్పించారు. నూకాలమ్మ తల్లి గ్రామ ప్రజలపై కరుణ, కటాక్షాలు చూపించి అందరినీ చల్లగా చూడాలని ఆమె అభిలాషించారు. ఆమె వెంట వైఎస్సార్ సీపీ నేతలు కటకంశెట్టి ఆదిత్యకుమార్, తోరం సూర్య భాస్కర్, పాముల దేవీప్రకాష్, పోతు కాశీ, పినిశెట్టి నాగబాబు ఉన్నారు. జాతర మహోత్సవాల్లో భాగంగా ఆలయం వద్ద శుక్రవారం భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. నయినాల రాఘవులు, వెంకటరెడ్డి, జగన్నాథం, రంగారావు, కృష్ణమూర్తి, గోపాలరావు స్మారకార్థం వారి కుటుంబ సభ్యులు ప్రతి ఏడాది నిర్వహిస్తున్న విధంగానే ఈ ఏడాది కూడా భారీ అన్నదానం ఏర్పాటు చేశారు.